## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 12-9-99, పాలకొల్లు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ప్రాణంతో తిరిగే ప్రతీశరీరం మరణిస్తుంది. అలాగే మనశరీరాలు అన్నీ మరణిస్తాయి. పుట్టుక చావుతో అంతమవుతుంది. ఈ శరీరాన్ని దహనం చేస్తారు. అక్కడితో శరీర యాత్ర ముగుస్తుంది. ఈ శరీరం నాది అనేవాడు జీవుడు లోపల ఉన్నాడు కదా. శరీరాన్ని విడిచిపెట్టాక జీవుడు ప్రయాణం చేస్తాడు. మనం హైదరాబాద్ ఫలానా ట్రైనులో వస్తున్నాము అని లెటరువ్రాస్తే మన బంధువులు, స్నేహితులు స్టేషన్‌కు వచ్చి రిసీవ్ చేసుకొంటారు. మరి శరీరాన్ని విడిచిపెట్టాక ప్రయాణం చేసే జీవుడిని ఎవరు రిసీవ్ చేసుకొంటారు? మమ్మల్ని రిసీవ్ చేసుకోండి అని చెపితే రిసీవ్ చేసుకొనేవారు ఎవరైనా ఉన్నారా? లేరు అని అనుకోవద్దు ఉన్నారు ఎవరు అంటే ఈ శరీరం భూమిమీద ఉండగా మనం చేసిన మంచిపనులు, మాట్లాడిన మంచి మాటలు శరీరం మరణించాక జీవుడిని రిసీవ్ చేసుకొని చీకటిమార్గంలో కాకుండా వెలుగు మార్గంలో మంచిలోకాలకు తీసుకొని వెళతాయి. ఆ మంచిపనుల యొక్క ఫలితం ఉన్నంతకాలం అక్కడఉంటాము. మనం చేసిన మంచి పనులు, మాట్లాడిన మంచి మాటలు, మన మొదడులోనికి వచ్చే మంచిఆలోచనలు వృధాపోతాయి అనుకోవద్దు. ఈ శరీరం మరణించాక జీవుడిని అవిదగ్గర ఉండి తీసుకొని వెళతాయి. మనం మరణం అంటే కంగారు పడతాము కాని మనం మంచిపనులు చేసిఉంటే కంగారుపడనక్కరలేదు. ఎందుచేతనంటే అవే మన జీవుడికి దగ్గర ఉండి దారి చూపిస్తాయి. మరణం యొక్క వాస్తవ రూపం తెలిసే కొలది మరణం అంటే భయం పోతుంది.

మనందరము గుడికి వెళుతున్నాము. గుడిలో ఉన్న దేవుని చూస్తున్నాము. గుడిలో ఉన్న దేవుడిని చూడటం మంచిదే. గుడిలో ఉన్నదేవుడిని చూడటం వలన మరణించటం పుట్టటం ఈ రాకలుపోకలు ఇవి అన్నీ ఆగిపోవు. ఈ ప్రయాణాలు ఎప్పడు ఆగిపోతాయి అంటే, నీ కడసారి జన్మ ఎప్పడు అంటే నీ హృదయంలో ఉన్న దేవుడిని చూడాలి. గుడికి వెళతారు, దేవుని చూస్తారు. మాకు శాంతి లేదు, సుఖం లేదు అంటారు. గుడిలో ఉన్న దేవుని చూడటం వలన మీకు శాంతి కలుగదు. హృదయంలో ఉన్న దేవుడిని చూస్తే మనకు పరిమితులు లేని సుఖం, శాంతి కలుగుతుంది. అప్పడు స్వర్గానికి వెళ్ళాలి, ఈ లోకానికి వెళ్ళాలి, ఆలోకానికి వెళ్ళాలి అనే సంకల్పమే ఉండదు.

మనలను ఎవరైన పొగిడితే పొంగిపోతాము, ఎవరైనా విమర్శిస్తే కృంగిపోతాము. అదీ తట్టుకోలేము, ఇదీ తట్టుకోలేము. సుఖం వచ్చినా తట్టుకోలేము. దుఃఖం వచ్చినా తట్టుకోలేము.

తిలక్ గారు చాలా సమానంగా ఉండేవారట. ఆయన గురించి ఒక సంఘటన చెపుతారు. తిలక్ గారు ఒకరోజు టీ త్రాగుతూ పేపరు చదువుతున్నారట. వారి మనవలు బిస్కట్లు తింటూ టీ త్రాగుతున్నారట. మీరు ఏమి చేస్తున్నారు అని తిలక్ గారు మనవలను అడిగారట. మేము బిస్కట్లు తింటూ టీ త్రాగుతున్నాము అని చెప్పారట. మరి నేనేమి తింటున్నాను అని అడిగారట. మీరు ఏమీ తినటం లేదు టీ త్రాగుతున్నారు అన్నారట. అప్పుడు తిలక్ గారు చెప్పారట ఈ పేపరు అంతా నన్ను తిడుతూ వ్రాసారు. మీరు బిస్కట్లు తింటూ టీ త్రాగుతున్నారు నేను తిట్లు తింటూ టీ త్రాగుతున్నాను. అదే తేడా మీరు బిస్కట్లు తింటున్నారు, నేను తిట్లు తింటున్నాను అని చెప్పారట, ఇది ఎందుకు చెపుతున్నాము అంటే అప్పుడుకూడా ఆయన మొఖంలో వికారం కనబడలేదు. ఆ స్థాయిని కనుక మనం సంపాదిస్తే ఇంక రాకపోక ఉండదు. ఈ శరీరం పడిపోయినప్పడే మోక్షస్థితిని అందుకొంటాము. అప్పడు వాడికి శరీరం ఉన్నా, శరీరం లేకపోయినా ఒక్కటే. ఈ లోకం కనిపించిన కనిపించకపోయినా ఒక్కటే, నేను ఉన్నాను అన్న సంగతి వాడికి తెలుస్తూ ఉంటుంది, ఉండటం అనేది వాడికి అనుభవం అవుతూ ఉంటుంది. లోపలఉన్న శాంతి, సుఖం వాడికి ఎంత అనుభవంలోనికి వస్తుంది అంటే వాడి మనస్సు చెదరమంటే చెదరదు, ఇంద్రియాలు కదలమంటే కదలవు. అటువంటి ఉన్నతమైన ఉదాత్తమైన స్థితిని ఆ జీవుడు అందుకొంటాడు. ఆ స్థితిని అందుకొనే వరకూ మనకు జన్మించటం, మరణించటం జరిగిపోతూ ఉంటాయి. మనం చేసే పూజలు, జపాలు, ధ్యానాలు ఆ స్థితిని పొందటం కోసమే.

మనకు, లోకానికి ఆధారంగా ఏ వస్తువు అయితే ఉందో అదే చైతన్యం, వాడే నారాయణుడు. మనం లోకాన్ని చూస్తున్నాము గాని లోకానికి ఆధారంగా ఉన్న వస్తువును చూడటం లేదు. దానికి మోహమే కారణం. ఈ లోకాన్ని ఎంజాయ్ చేయాలనే భోగబుద్ధి ఉన్నంతకాలం మనకు ఆత్మబుద్ధి కలుగదు. కొంతమంది 100 సంవత్సరాలు వచ్చినా లోకాన్ని మామిడిటెంకను నాకినట్లు నాకుతూ ఉంటారు. 100 సంవత్సరాలు జీవించాము ఇప్పటికైనా మనస్సును లోపలకు తోలుకొని వెళదాము అనేటువంటి వైరాగ్యం, అభ్యాసం ఉండదు. మనం ఏ గురువును ఆశ్రయించినా, ఏ సాంప్రదాయంలో ప్రయాణించినా ప్రకృతిగుణాలు దాటకుండా మనకు ఆత్మజ్ఞానం కలుగదు. అంతవరకు మనకు ఏజన్మకు ఆజన్మ శవబుద్ధి ఉంటుంది కాని శివబుద్ధి కలుగదు. మాటకంటే మౌనం గొప్పది. మౌనం యొక్క శక్తి హృదయం యొక్క లోయలలోనికి నిన్ను గెంటుకొనిపోతుంది. మహాత్ముల యొక్క మౌనం వలన వారు చూడటం వలన, వారి గాలి సోకటం వలన మన హృదయంలో ఉన్న వస్తువు మన సహస్రారంలో ఒక్కసారి తళుక్కున